## క్లుప్తంగా

### నేడు విద్యుత్ కోతల వేళలు

పాలకోడేరు: మోగల్లు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పీఆర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు, కుముదవల్లి, యండగండి, ఉఱుదుర్రు గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

సాక్షి, భీమవరం: భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాయలంతోటలో పేకాట శిబిరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు టుటౌన్ ఎస్సై ఫణిమోహన్ చెప్పారు. శనివారం రాయలం తోటలో పేకాడుతున్నట్లు సీఐ జి శ్రీనివాస్‌కు సమాచారం రావడంతో దాడిచేయగా ఆరుగుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ. 5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఫణిమోహన్ చెప్పారు.

### పీవీఎల్ పరామర్శ

కాళ్ల: ఏలూరుపాడు గ్రామ సర్పంచ్ భూపతిరాజు వెంకట జగ్గరాజు(జగ్గబాబు) ను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు శనివారం పరామర్శించారు. జగ్గరాజు మాతృమూర్తి వెంకట నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వెంకట నరసమ్మ చిత్రపటానికి పీవీఎల్ పూలమాలలు వేసి నివాళులర్పించి ఆ కుటుంబానికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, మంతెన రామకృష్ణరాజు, దాట్ల రామభద్రరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ఆక్వా రైతుల్ని ఆదుకోవాలి

ఆకివీడు: ఆక్వా రంగం ఆర్థిక ఒడిదుడుకుల్లో ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కె.తవిటి నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో మేత ధరలు పెరిగిపోయాయని, విద్యుత్ ధరల పెంపు, మరొపక్క రొయ్యల ధరలు పడిపోవడంతో రైతులు కుదేలవుతున్నారన్నారు. సతమతమవుతోన్న ఆక్వా రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్వీ. గోపాలన్, పెంకి అప్పారావు, డోకల రవితేజ, బి.రాంబాబు, సందక సూరిబాబు, ఎస్కే. వలీ పాల్గొన్నారు.

### బంగారయ్యకు సత్కారం

ఆకివీడు: వృద్ధుల సంక్షేమం కోసం గత 13 ఏళ్లుగా విశిష్ట సేవలందిస్తున్న స్థానిక సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్యను శుక్రవారం ఉమ్మడి జిల్లా ఏలూరులో సత్కరించినట్లు ఆయన శనివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని సత్కారం, అవార్డును ప్రకటించారన్నారు. దాతల సహకారంతో 11 వేల మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేయించానని, ఈ సందర్భంగా సత్కరించినట్లు ఆయన తెలిపారు. బంగారయ్యను వృద్ధుల సంఘ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు, లయన్స్ ప్రతినిధులు, స్థానిక నాయకులు అభినందించారు.

### ఏఎస్పీ పెద్దిరాజుకు సత్కారం



పెద్దిరాజు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని బంటుమిల్లి గ్రామానికి చెందిన సీబీఐ ఏఎస్పీ బండి పెద్దిరాజును స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం శృంగవృక్షం గ్రామ ఆర్యవైశ్య సంఘం అత్యం సూర్య ప్రకాష్‌రావు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బహుజన కులాల నాయకులు చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడుతూ కానిస్టేబుల్ స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయికి ఎదిగిన పెద్దిరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామాభివద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ, సర్పంచ్ జంగం సూరిబాబు, ఉపసర్పంచ్ కలిదిండి ఆనందరాజు, ఎంపీటీసీ సవరం సత్యకృష్ణ, జిల్లా బీసీ నాయకులు పాల రాధాకృష్ణ వీరవాసరం కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, వార్డు సభ్యురాలు సోము దుర్గా భవాని పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

భీమవరం అర్బన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన నిర్మించుకోవాలని హౌసింగ్ శాఖ పీడీ డాక్టర్ ఆర్‌సి ఆనంద్ కుమార్ అన్నారు. భీమవరం మండలంలోని జొన్నలగరువు గ్రామంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ శాఖ పీడీ డాక్టర్ ఆర్‌సీ ఆనంద్‌కుమార్, ఆర్డీఓ దాసి రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ డాక్టర్ ఆర్ సి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు రూ. 1లక్షా 80 వేలు బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. అంతేకాకుండా కనీస మౌళిక వసతులైన విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు ఇస్తుందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై. రవికుమార్, హౌసింగ్ ఏఈ శశికుమార్, సర్పంచ్ సోడదాసి లలిత కుమారి పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి



భీమవరం అర్బన్: ఎల్‌వీఎన్ పురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగుల వైద్య పరీక్షల లిస్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



వీరవాసరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు

**ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్**

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిరక్షించుకోవాల్సి ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. భీమవరం మండలంలోని ఎల్‌వీఎన్ పురం గ్రామంలో సచివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిరీత్యా నిత్యం బిజీ బిజీగా ఉంటూ చిన్నపాటి అనారోగ్య సమస్యలు కూడా పట్టించుకోకుండా ప్రస్తుత సమాజంలో జీవన యానం సాగుతుందన్నారు. ఆ చిన్నపాటి అనారోగ్య సమస్యలు పెద్ద అనారోగ్య సమస్యలుగా తయారవుతున్నాయన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య ఇబ్బందులను తీరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహసీల్దార్ వై. రవికుమార్, ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మీ, పంచాయతీ రాజ్ డీఈ స్వామి నాయుడు, సర్పంచ్ కేతా నాగబాబు, ఎంపీటీసీ సభ్యుడు వీరవల్లి శ్రీనివాస్, పెచ్చెట్టి పవన్, కొల్లి శ్రీనివాస్, కుడిపూడి సత్యనారాయణ, బొంతు శ్రీనివాస్, ఇళ్ల రాంబాబు, వి. శ్రీనివాస్, దొంగ శ్రీనివాస్, కొయ్యలగడ్డ బాల మురళి, కండిబోయిన బాబురావు, రామాని వనమ రాజు పాల్గొన్నారు.

**వీరవాసరంలో..**

వీరవాసరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు తెలిపారు. రాయకుదురు గ్రామ సచివాలయం పరిధిలో జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో బాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. ప్రతి ఇంటింటికీ తిరిగి వైద్య సిబ్బందితో సర్వేలు నిర్వహించి, ఎవరికి ఏ వైద్యం అవసరమో గుర్తించి, వారికి ప్రత్యేక చికిత్సలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. రాయకుదురు గ్రామ సచివాలయ-1 పరిధిలోని సుమారు 750 మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం భారతి, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, వైసీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, పోలిశెట్టి సత్యనారాయణ, గూడూరి ఓంకార్, గెడ్డం భాస్కరరావు, పోలిశెట్టి శివన్నారాయణ, నూకల కనకారావు, నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, గూడూరి రాంబాబు, పి.జ్యోతి, సుజాతా రాణి, దుర్గా ప్రసాద్, పాలా లీల తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్
- పెదఅమిరం గ్రామంలో ప్రజాసంకల్ప పాదయాత్ర



పెదఅమిరం గ్రామంలో పాదయాత్ర నిర్వహిస్తున్న పీవీఎల్, పార్టీ నాయకులు

కాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు తెలిపారు. కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలో శనివారం ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దలు, పార్టీ నాయకులతో జరిగిన సమీక్షా సమావేశంలో గత నాలుగున్నర ఏళ్లలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఒక్క పెద అమిరం గ్రామానికి సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధి రూపంలో సుమారు రూ.27 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసినట్లు స్పష్టం చేశారు. ప్రజల్లోకి నిత్యం వెళ్లగలుతున్నామంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్పతనమని, ఆయన అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వలనే ప్రజల్లో ధైర్యంగా వస్తున్నామన్నారు. అంతే కాకుండా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తూ మోసం చేసేందుకు వస్తున్నారని వారి మాటలను నమ్మవద్దని కోరారు. వచ్చే ఎన్నికల్లో సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని పీవీఎల్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంచినీటి సమస్య ఉందని, పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. అనంతరం గ్రామంలో ప్రజా సంకల్ప పాదయాత్ర నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో సీసీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, ఉండి ఏఎంసీ చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు జవ్వాది సత్యనారాయణ, బిరుదుగడ్డ గంగాధర్, ఆనంద్‌రాజ్, జవ్వాది కిషోర్, బిరుదుగడ్డ రమేష్ పాల్గొన్నారు.

### దసరా విజయీభవ యాత్ర బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దసరా విజయీభవ యాత్ర బ్రోచర్ ను ఆవిష్కరించారు. దేవస్థానం అర్చకులు కొడమంచిలి కొప్పయ్య శర్మ, నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 27 వరకు విజయీభవ శోభాయాత్ర సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని కార్యక్రమంలో అరసవల్లి సుబ్రమణ్యం, నల్లం లోక నాదం, గ్రంధి చిన తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం



పాలకోడేరు: కుముదవల్లిలో ఐసీడీఎస్ పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న పీవీఎల్



కాళ్ల: కాళ్ళకూరులో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో పాల్గొన్న పీవీఎల్



ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆకివీడు: ప్రజల సంపూర్ణ ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు అన్నారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పీవీఎల్ గత వారం రోజులుగా ప్రతి ఇంటికీ వెళ్లి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రజల ఆరోగ్యంపై వివరాలు సేకరించి, వారి పరిధిలో వైద్యం అందజేశారని చెప్పారు. అంతకు మించిన వైద్యం అందజేసేందుకు సచివాలయ పరిధిలో ప్రత్యేక క్యాంపులతో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులతో వైద్యం అందజేస్తున్నామని చెప్పారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బీపీ, సుగరే కదా అని నిర్లక్ష్యం చేస్తే బీపీతో గుండెపోటు, సుగర్‌తో అవయవాలు పాడయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. ఆరోగ్య సురక్షలో వేలాదిగా సుగర్, బీపీ పేషెంట్లు కొత్తగా బయటపడ్డారని పీవీఎల్ చెప్పారు. మంచి ఆహారం తీసుకోవాలని ప్రత్యేక స్టాల్స్ ద్వారా ప్రజలకు తెలియజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే.రసూల్ బీబీ, సర్పంచ్ కోట అనంతలక్ష్మి, మండల జేసీఎస్ పుప్పాల పండు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఏ కృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చిక్కాల రామాంజనేయులు(చిన్నా), యాళ్లబండి వెంకటేశ్వరరావు, ఏ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి వేణు గోపాల్, ఎంపీడీఓ కందుల వాణి, వైద్యులు మెహరున్నీసా బేగం, వైద్యులు కవిత, గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

**కాళ్లకూరులో...**

కాళ్ల: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు స్పష్టం చేశారు. కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రతి ఒక్కరు వైద్యసేవలు పొందాలని కోరారు. సర్పంచ్ సాధు శ్రీదేవి, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, నడింపల్లి ప్రదీప్‌రాజు, వేగేశ్న విజయరామరాజు పాల్గొన్నారు.

**ఎన్నార్పీ అగ్రహారంలో...**

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ సూరవరపు కనకదుర్గవెంకటాచార్యులు, ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మీశ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, గలావిల్లి ధనుంజయ, బి.రామకృష్ణ, ఎంపీడీవో ఏవీ అప్పారావు, డాక్టర్ పంజా ధర్మతేజ్, హెచ్ఎం ఎంవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

**కుముదవల్లిలో...**

పాలకోడేరు: కుముదవల్లిలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైందన్నారు. అనేకమంది ప్రజలు వైద్యసేవలు పొందడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, ఉండి ఏఎంసీ చైర్మన్ బి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ చేకూరి నరేంద్రరాజు, సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణంరాజు, సర్పంచులు బొల్లా శ్రీనివాస్, చింతపల్లి వెంకటనారాయణ, గొట్టుముక్కల శివాజీ రాజు, బొక్కా రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ గుండు నాగేశ్వరరావు, చెల్లబోయిన పాపారావు పాల్గొన్నారు.

# పాలకోడేరులో ముగిసిన గడపగడపకు



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

పాలకోడేరు: గత మూడు రోజులుగా పాలకోడేరులో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు రెండు సచివాలయాల పరిధిలో ఇంటింటికీ తిరిగి జగనన్న అమలు చేస్తున్న పథకాలు గురించి ప్రజలకు వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంలో అనేక మంది ఆరోగ్యశ్రీ పథకం, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత చేదోడు , వాహన మిత్ర, ఆసరా తదితర పథకాలు తమకు ఎలా ఉపయోగపడ్డాయో లబ్ధిదారులు వివరించారు. మళ్లీ జగనన్న ప్రభుత్వాన్నే గెలిపించికుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెప్పడంతో పీవీఎల్ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయం-1 పరిధిలో రూ.20 లక్షలు మంజూరు కాగా, గ్రామస్తుల కోరిక మేరకు రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం సచివాలయం-2 పరిధిలో మంజూరుకానున్న రూ.20 లక్షలతో మిగిలిన సమస్యలను పరిష్కరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులను తన దృష్టికి తీసుకువచ్చారని ఆ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా పీవీఎల్ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, ఉండి ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ చేకూరి నరేంద్రరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచ్ దెందుకూరి వెంకటరాజు, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మి తులసి, ఎంపీటీసీలు కే నాగలక్ష్మి, పెన్మెత్స వెంకటలక్ష్మి, కాటూరి శాంతకుమారి, షేక్ పాపా సాహెబ్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్**



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని ఎల్‌వీఎన్ పురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో నిర్మించి 5 ఇంటర్నల్ సీసీ రోడ్లను శనివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు క్షేత్ర స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రజల కోరిక మేరకు సీసీ రోడ్లను, డ్రైన్లను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ ,చైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

### అన్నసమారాధనలు

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాల ముగింపులో భాగంగా శనివారం స్థానికంగా పలు చోట్ల భారీ అఖండ అన్న సమారాధనలు నిర్వహించారు. స్థానిక సంతపేటలో అన్న సమారాధన కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద లక్ష్మీ గణపతి పూలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన జరిగింది. మాదివాడలోనూ, రజక పేటలో, దుంపగడప రోడ్డులోని పొలిమేర వద్ద అన్న సమారాధనలు చేశారు.

### ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలనను తెచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేశంలోనే అత్యుత్తమ జన నాయకుడిగా నిలిచారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం లో శనివారం ఆంధ్రప్రదేశ్ జగనే ఎందుకు కావాలి కార్యక్రమ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంటే ప్రజలని వారికి పూర్తిస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించాలంటే ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకెళ్లాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని అన్నారు. జనసేన కార్యకర్తలు కూడా అసహ్యించుకునేలా పవన్ కల్యాణ్ వారాహి యాత్ర సాగుతుందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, గొలగాని సత్యనారాయణ, తోట భోగయ్య, గూడూరి ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవనం

సాక్షి, భీమవరం: విద్యార్థులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని గైనకాలజీ నిపుణురాలు డాక్టర్ డి.విజయ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంటల్ సెల్ శనివారం నిర్వహించిన ఉమెన్ హెల్త్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ చాలామంది విద్యార్థులు వివిధ కారణాలతో సరైన పోషకాహాకారం తీసుకోకపోవడం వల్ల శరీరంలో రక్తం శాతం తగ్గి వివిధ రకాల వ్యాధులకు గురవుతారన్నారు. మహిళలకు సాధారణ స్థాయిలో రక్తం లేకపోతే వ్యాధులు వెంటాడుతాయని ఆమె హెచ్చరించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణమరాజు తదితరులు డాక్టర్ విజయను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, పగిడిపాటి భువనేశ్వరి, జి శశికళ, జి శ్రీ బాల, బిహెచ్ రేవతి ,జి శ్రీసత్య తదితరులు పాల్గొన్నారు.

### కుప్పనపూడి పంచాయతీలో అవినీతిపై విచారణ

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామ పంచాయతీలో అవినీతి జరుగుతుందని గ్రామానికి చెందిన నంద్యాల సీతారామయ్య, మెంటే లక్ష్మణరావు చేసిన ఫిర్యాదుపై విచారణ చేసినట్లు డీఎల్‌పీఓ ఏ.కొండలరావు శనివారం విలేకర్లకు తెలిపారు. గ్రామంలోని మల్లయ్య చెరువు వేలంపాట లేకుండా చేపలు పట్టుకున్న విషయంపై, అనధికారికంగా వేసిన 72 పైపులపైనా, పెద చాకిరేవు చెరువు అక్రమంగా తవ్వి, మట్టి అమ్మిన విషయంపైనా, ప్రైవేటు ఆర్వో ప్లాంట్‌కు సర్పంచ్ భర్త ముత్యాల శివన్నారాయణ అక్రమంగా విద్యుత్ వాడకం, మల్లయ్య చెరువుకు పైప్‌లైన్‌నిమిత్తం సుమారు రూ.20 లక్షలు వసూలు చేసిన విషయంపై విచారణ చేయాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఆయా ప్రాంతాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేశామని, నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని డీఎల్‌పీఓ వివరించారు.